క్లుప్తంగా

రేషన్ డీలర్ అక్రమ వసూళ్లు



మానవపాడు: రేషన్ సరకుల పట్టిక పుస్తకం ఇవ్వడం కోసం ఓ రేషన్ డీలర్ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని కొర్విపాడు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామంలో రేషన్ షాపు డీలర్ హీరాబాయి పట్టిక పుస్తకం ఇవ్వడం కోసం ఒక్కో కార్డు దారుని నుంచి రూ. 75 నుంచి రూ.150 వరకు వసూలు చేస్తున్నట్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో సుమారు 560 దాకా కార్డులు ఉన్నట్లు తెలిపారు. ఈ విషయమై తహసీల్దార్ జోషి శ్రీనివాస్‌శర్మను వివరణ కోరగా.. అక్రమ వసూళ్లకు పాల్పడిన వారిపై విచారణ చేసి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

క్షయవ్యాధి నిర్మూలనకు చర్యలు

మానవపాడు: క్షయ నిర్మూళనకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని టీబీ ప్రోగాం అధికారి రాజు అన్నారు. గురువారం చెన్నిపాడు గ్రామంలో ముక్తభారత్ అభియాన్‌లో భాగంగా ప్రత్యేక శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. క్షయ నిర్మూలనకు ప్రతి ఒక్కరికి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. టీబీ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం కోసం ప్రభుత్వం ప్రతినెల రూ.1,000 ఆర్థిక సాయం చేస్తుందన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ చంద్రన్న, సంధ్యారాణి, అనుసుయమ్మ, ఆశలు తదితరులు పాల్గొన్నారు.

రెండు నెమళ్ల మృతి



అలంపూర్: మృతి చెందిన రెండు నెమళ్లను అటవీ శాఖ అధికారులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు. మండలంలోని ర్యాలంపాడు గ్రామంలో గురువారం గ్రామానికి చెందిన శాలిబాష అనే వ్యక్తి నెమళ్లు మృతి చెంది ఉండటాన్ని గుర్తించి సమాచారం అందించగా కానిస్టేబుళ్లు ఆంజనేయులు, గోవర్ధన్ గ్రామానికి వెళ్లి విచారణ చేసి నెమళ్ల మృతదేహాలను అటవీ శాఖ అధికారులకు అందజేసినట్లు పేర్కొన్నారు.

అటవీ అధికారుల చెంతకు

మానవపాడు: మండలంలోని అమరవాయి గ్రామంలో గురువారం నడవలేని స్థితిలో ఉన్న రెండు నెమళ్లను గ్రామస్తులు పోలీసు స్టేషన్‌లోని ఎస్ఐ చంద్రకాంత్‌కు అప్పగించారు. ఎస్ఐ చంద్రకాంత్ నెమళ్లకు చికిత్స అందించి అటవీ శాఖ అధికారులకు అప్పగించారు.

13 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

మానవపాడు: మండలంలోని చిన్నపోతులపాడు గ్రామంలో గురువారం పేకాట ఆడుతున్న 13 మంది పట్టుకున్నట్లు ఎస్ఐ చంద్రకాంత్ తెలిపారు. చిన్నపోతులపాడు గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారన్నా సమాచారం మేరకు దాడి చేసి 13 మందిని అదుపులోకి తీసుకొని పేక ముక్కలు, రూ.6,780 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

యువకుడి అదృశ్యం

మానవపాడు: ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువకుడు అదృశ్యంపై కేసు నమోదైన ఘటన మండలంలోని జల్లాపురంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్ఐ చంద్రకాంత్ తెలిపిన వివరాలు.. జల్లాపురం గ్రామానికి చెందిన ప్రేమ్‌రాజ్ ఈ నెల 30న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఎంత వెతికిన ఆచూకీ తెలియకపోవడంతో ప్రేమరాజ్ తండ్రి హుస్సేన్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ఎర్రవల్లి: మండల పరిధిలోని వల్లూరు గ్రామానికి చెందిన సల్కెపోగు గోపాల్ ఇటీవల పిచ్చికుక్క దాడిలో గాయపడి మృతి చెందాడు. ఈ నేపథ్యంలో గ్రామస్తులు గురువారం మృతుని భార్య దానమ్మకు రూ.23,100 ఆర్థిక సాయం మానవత్వం చాటుకున్నారు. కార్యక్రమంలో జమ్మన్న, హనుమన్న, బానుప్రకాష్, శేఖర్, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

గట్టు: మండల పరిధిలోని బస్వాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు రంగన్న సోదరి రంగమ్మ కుటుంబ సభ్యులను గురువారం గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి పరామర్శించారు. అనారోగ్యంతో రంగమ్మ మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కుటుంబ సభ్యులను పరామర్శించి, సంతాపం తెలియజేశారు.

ప్రభుత్వ లక్ష్యం నెరవేరేనా ?

- జాడలేని మినీ భూసార పరీక్ష కేంద్రాలు
- 2018లో క్లస్టర్‌కు ఒకటి చొప్పున మంజూరు
- ఇబ్బందులు పడుతున్న రైతులు



షేకుపల్లిలో పరీక్ష కోసం మట్టిని తీస్తున్న రైతులు

ఎర్రవల్లి: భూసార పరీక్షలపై సరైన అవగాహన లేక రైతన్నలు అప్పుల పాలవుతున్నారు. పంటలకు అవసరం లేని ఎరువులు, క్రిమి సంహారక మందులను వినియోగిస్తూ ఆర్థికంగా నష్టపోవడమే గాక ఆశించిన స్థాయిలో దిగుబడులు రాక అప్పుల పాలవుతున్నారు. అవగాహన కల్పించాల్సిన వ్యవసాయ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మినీ భూసార పరీక్ష కేంద్రాల జాడలేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

క్లస్టర్‌కు ఒకటి చొప్పున

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా ఒకే భూసార పరీక్ష కేంద్రం ఉండటం వల్ల రైతుల నుంచి సేకరించిన మట్టి నమూనాలను అధికారులు అక్కడికి పంపేవారు. పరీక్ష కేంద్రం నుంచి రిపోర్టు రైతులకు అందేందుకు చాలా సమయం పడుతుండటంతో తెలిసిన రైతులు కూడా పరీక్షలు చేయించేందుకు ఆసక్తిని కనబర్చడం లేదు. ఈ నేపథ్యంలో ప్రతి క్లస్టర్‌కి ఒకటి చొప్పున మినీ భూసార పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు అనుగుణంగా 2018లో ఆయా క్లస్టర్లలో కేంద్రాలను ఏర్పాటు చేయాలని వ్యవసాయ అధికారులను ఆదేశించింది. దీనికి సంభందించిన కిట్లను కూడా ఆయా క్లస్టర్లకు గతంలోనే సమకూర్చింది. కానీ గదుల కొరత, విద్యుత్, తదితర సమస్యల కారణంగా కొన్ని క్లస్టర్లలో ఏర్పాటు చేయలేదు. కాగా మరి కొన్ని క్లస్టర్లలో గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఏర్పాటు చేసినా అవి కొద్దిరోజులు మాత్రమే పని చేశాయి. మిగిలిన క్లస్టర్లలోని కిట్లన్నీ నిరుపయోగంగా మారడంతో కనుమరుగైపోయాయి.

పైలెట్ గ్రామాల ఎంపిక..

సేంద్రీయ సాగు చేపట్టాలంటే భూసార పరీక్షలు తప్పనిసరి. అలంపూర్ నియోజకవర్గంలో మొత్తం 53 క్లస్టర్లు ఉండగా.. ప్రభుత్వం భూసార పరీక్షల కోసం పైలెట్ ప్రాజెక్టుగా 7 మండలాల నుంచి ఒక్కొక్క గ్రామాన్ని ఎంపిక చేసింది. ఆయా గ్రామాల్లో రైతుల పొలాల్లో మట్టి నమూనాలు సేకరించి ఫలితాల నివేదికలను రైతులకు అందించాలని వ్యవసాయ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో మినీ భూసార పరీక్షల కేంద్రాలు వినియోగంలో లేకపోవడంతో వారు ఆయా మట్టి నమూనాలను సమీపంలోని ల్యాబోరేటరికి పంపించి ఫలితాలు రైతులకు అందిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామాల్లో వ్యవసాయ పొలాల మట్టి నమూనా పరీక్షలు నిర్వహించాలని రైతువేదికల్లో భూసార పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసి ఆదుకోవాలని నియోజకవర్గ రైతులు కోరుతున్నారు.

మండలాల వారీగా క్లస్టర్ల వివరాలు

మండలం	క్లస్టర్లు
ఇటిక్యాల	12
మానవపాడు	07
అలంపూర్	05
ఉండవెల్లి	07
రాజోళి	06
వడ్డేపల్లి	05
అయిజ	11



చాగాపురంలో ఎరువుల యాజమాన్యంపై అవగాహన కల్పిస్తున్న ఏడీఏ



కొండేరులో ఎర్ర తెగులు సోకిన పత్తిపంటను పరిశీలిస్తున్న అధికారులు(ఫైల్)

ఇబ్బందులు తప్పడం లేదు..



మండల కేంద్రాల్లో భూసార పరీక్ష కేంద్రాలు లేక ఇబ్బందులు తప్పడం లేదు. మండలంలోని రైతులు మట్టి నమూనాలు 100 కిలోమీటర్ల దూరంలో గల జడ్చర్ల ల్యాబ్‌కు పంపిస్తున్నారు. రిపోర్టులు కూడా సక్రమంగా రావడం లేదు. ప్రతి క్లస్టర్లో తప్పకుండా భూసార పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి. – పెద్ద వీరన్న, రైతు, సాసనూలు

దిగుబడి తక్కువగా ఉంది



మా గ్రామంలో రైతులు అధికంగా మిరప పంటను సాగు చేస్తారు. స్థానికంగా భూసార పరీక్ష కేంద్రాలు లేక మట్టి పరీక్షలను చేయించుకోవడం లేదు. దీంతో పంట దిగుబడి రావడం లేదు. దీనివల్ల రైతులు ఆర్థికంగా నష్టపోయి అప్పులపాలవుతున్నారు. ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలి. – రవికుమార్, రైతు, కారుపాకుల

మట్టి పరీక్షలు చేయించుకోవాలి



రైతులు భూసార పరీక్షలను మూడేళ్లకు ఒకసారి తప్పకుండా చేయించుకోవాలి. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని జడ్చర్లలో మాత్రమే భూసార పరీక్ష కేంద్రం ఉంది. రైతువేదికల్లో భూసార పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. ఇట్టి విషయాన్ని ప్రభుత్వం దృష్టి తీసుకెళ్తాం. – సక్రియ నాయక్, జిల్లా వ్యవసాశాఖ అధికారి.

పల్లెల్లో పచ్చదనం పెంచుదాం



మిట్టదొడ్డి శివారులో మొక్కలను నాటుతున్న అధికారులు, గ్రామస్తులు

గట్టు: వనమహోత్సవం ద్వారా పల్లెల్లో పచ్చదనాన్ని తీసుకొద్దామని ఎంపీడీఓ చెన్నయ్య అన్నారు. వనమహోత్సవంలో భాగంగా గురువారం మిట్టదొడ్డి గ్రామంలో ఏపీఓ స్వామి, మహిళా సంఘాల సభ్యులతో కలసి రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. మండలంలో 72 వేల మొక్కలు నాటేందుకు ప్రణాళికలను సిద్ధం చేసినట్లు తెలిపారు. ప్రతి పంచాయతీకి 2,680 మొక్కలు కేటాయించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈసీ రామకృష్ణ, టెక్నికల్ అసిస్టెంట్లు సత్యన్న, దొరబాబు, కార్యదర్శి మారెప్ప పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం

అయిజ: మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకుందామని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని ఉప్పల క్యాంపు గ్రామంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న వన మహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామన్నారు. మొక్కలు విరివిగా నాటి, నాటిన ప్రతి మొక్కను రక్షించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఓ లాలూనాయక్, కార్యదర్శి స్వాతి, టెక్నికల్ అసిస్టెంట్ భారతి, ఫీల్డ్ అసిస్టెంట్ తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వనమహోత్సవ కార్యక్రమం

మానవపాడు: మండలంలోని కలుకుంట్ల గ్రామంలో ఎంపీడీఓ భాస్కర్ ఆధ్వర్యంలో వనమహోత్సవం నిర్వహించారు. గ్రామాల్లో స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మౌలాలి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కలుకుంట్లలో మొక్కలు నాటుతున్న ఎంపీడీఓ భాస్కర్



ఉప్పల క్యాంపులో మొక్కలు నాటుతున్న ఎంపీడీఓ వెంకటేశ్వర్లు

అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మార్కెట్



సమీకృత మార్కెట్ భవనాన్ని పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

అయిజ: మున్సిపాలిటీలో రూ.3 కోట్లతో నిర్మించిన సమీకృత మార్కెట్ అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిందని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి ఆరోపించారు. గురువారం బీజేపీ నాయకులు ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రామచంద్రారెడ్డి మాట్లాడారు. భవనం నిర్మించి ఏళ్లు గడుస్తున్నా వినియోగంలోకి తేకపోవడంతో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ. కోట్ల ప్రజాధనం వృథా అవుతుందన్నారు. జిల్లా అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టినాసరే వినిపించుకోవడం లేదని మండిపడ్డారు. మార్కెట్‌ను వెంటనే వినియోగంలోకి తీసుకురాకపోతే నిరసన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు భగత్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు నాగరాజు, కిసాన్ మోర్చా పట్టణ అధ్యక్షుడు వీరేష్‌గౌడ్, భీమసేనరావు, ప్రదీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి వేడుకలు



ఉండవెల్లిలో సాయిబాబాకు ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

అయిజ: మండల కేంద్రంలోని అయ్యప్పస్వామి ఆలయంలో సాయిబాబా మందిరంలో గురువారం గురుపౌర్ణమి సందర్భంగా వేదపండితులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలతోపాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని సకాపురం గ్రామంలోని రామకృష్ణ ధ్యాన మందిరంలో రామకృష్ణ సేవా సంస్థ ఆధ్వర్యంలో పూజలు చేశారు.

భక్తులతో కిక్కిరిసిన ఆలయాలు

ఎర్రవల్లి: గురుపౌర్ణమిని పురస్కరించుకొని బీచుపల్లి పదో పటాలంలోని సాయిబాబా ఆలయం భక్తులతో కిక్కిరిసింది. పదో పటాలం కమాండెంట్ జయరాజు కుటుంబ సభ్యులతో కలిసి సాయిబాబాను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్లు నరేందర్‌రెడ్డి, శ్రీనివాసరావు, పాణి, ఆర్ఐలు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వర కల్యాణం

అయిజ: మండలంలోని ఉత్తనూరులో ధన్వంతరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితులు శాస్త్రోక్తంగా శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులకు కల్యాణం జరిపించారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాలను రథంపై ఊరేగించారు.

గురు పౌర్ణమి ప్రత్యేక పూజలు

ఉండవెల్లి: మండల కేంద్రంలోని మణికంఠ అయ్యప్పస్వామి ఆలయంలో సాయిబాబాకు భక్తులు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయం చుట్టు పల్లకీ సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త దామోదర్‌రెడ్డి, అర్చకులు అంజనేయశర్మ, సుక్ల పాల్గొన్నారు.

వేడుకగా ఆదిశిలావాసుడి కల్యాణం

మల్దకల్: ఆదిశిలా క్షేత్రంలోని స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య కనులపండువగా సాగింది. వేదపండితులు రమేషాచారి, మధుసూదనాచారి, రవిచారి, శశాంక్‌లు స్వామివారి ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదే విధంగా మహా హోమం చేశారు. వేడుకలు తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు అరవిందరావు, చంద్రశేఖర్‌రావు, దీరేంద్రదాసు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఆదిశిలా క్షేత్రంలో శ్రీనివాసుడి కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు



ఉండవెల్లిలో పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు



ఎర్రవల్లిలో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కమాండెంట్ జయరాజు





ఉత్తనూరులో కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు , అయిజలో సాయిబాబా ఆలయానికి పోటెత్తిన భక్తులు

ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ ఎన్నిక



నూతన కమిటీతో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు

మల్దకల్: మండలంలోని నాగర్‌దొడ్డి గ్రామంలో గురువారం ఎమ్మార్పీస్ గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికకు ఎమ్మార్పీఎస్ జిల్లా, మండల నాయకులు మోసన్న, చిన్నతిమ్మన్న, మహేష్ హాజరై మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ మాదిగల కోసం రాజీలేని పోరాటం చేస్తూ, సమాజంలో అనేక కార్యక్రమాలను చేపట్టినట్లు తెలిపారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా ప్రభాకర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా విజయ్, అధికార ప్రతినిధి ప్రవీణ్, ఉపాధ్యక్షులు తిమ్మన్న, రాజు, సభ్యులుగా యోబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బతుకన్న, పురుషోత్తం, రాజు, తిమ్మోతి, సుందర్‌రాజు, రాజానందం, సామెల్, స్వామిదాస్, దేవదాస్, తిమ్మన్న తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ స్థలాన్ని రక్షించాలి

గట్టు: గ్రామ పంచాయతీ స్థలం ఆక్రమణకు గురవుతుందని నడిగడ్డ హక్కుల పోరాట సమితి మండల అధ్యక్షుడు బలరాంనాయుడు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గట్టు గ్రామ పంచాయతీ పక్కన ఉన్న స్థలాన్ని ఎమ్మెల్యే అనుచరుడు ఆక్రమించుకొని షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తున్నట్లు ఆరోపించారు. నిర్మాణ పనులు కొనసాగిస్తున్న వ్యవహారంపై జిల్లా అధికారులు స్పందించి పంచాయతీ స్థలాన్ని ఆక్రమణల నుంచి రక్షించాలని కోరారు.

ఘనంగా చండీయాగం



ధరూరు: మండల కేంద్రంలోని కాళికాదేవీ ఆలయంలో గురువారం చండీయాగం ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త కాళిదాసు దంపతులు, కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరుతూ యాగం నిర్వహించినట్లు అర్చకులు కిష్టాచార్యులు తెలిపారు. యాగంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకొన్నారు.

గుంతల రోడ్డుతో అవస్థలు



ఇటిక్యాల సమీపంలో రోడ్డుపై ఏర్పడిన గుంతలు

ఇటిక్యాల: మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డుపై ఏర్పడిన గుంతలతో అవస్థలు పడుతున్నట్లు వాహనదారులు వాపోతున్నారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు అదుపుతప్పి ప్రమాదాల బారిన పడుతున్నట్లు పేర్కొంటున్నారు. గుంతలను పూడ్చి, రోడ్డుకు మరమ్మతు చేపట్టాలన్ని పలుమార్లు సంబంధిత అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



తక్కశీలలో ప్రమాదకరంగా గుంత పొంచి ఉన్న ప్రమాదం

ఉండవెల్లి: మండలంలోని తక్కశీల గ్రామంలో రోడ్డు పక్కన ఉన్న గుంత ప్రమాదకరంగా ఉంది. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో మిషన్ భగీరథ వాల్‌కు ఏర్పాటు చేసిన గుంతవలన ప్రమాదం పొంచి ఉన్నట్లు స్థానికులు వాపోతున్నారు. నిత్యం ఇదే రహదారిపై విద్యార్థులు, వృద్ధులు తిరుగుతుంటారని ప్రమాదం జరుగక ముందే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి



జాంపల్లిలో విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

ధరూరు: పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంఈఓ రవీంద్రబాబు అన్నారు. మండల పరిధిలోని మన్నాపురం, జాంపల్లి పాఠశాలలను గురువారం సందర్శించారు. మన్నాపురం ప్రాథమికోన్నత పాఠశాల చుట్టూ అపరిశుభ్రంగా ఉన్న పిచ్చి మొక్కలు తొలగించి, పాఠశాలను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. అదే విధంగా జాంపల్లిలోని పాఠశాలలో రికార్డులు, వంటగది, తరగతి గదులను పరిశీలించారు. వంట ఏజెన్సీ మహిళలతో మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. హెచ్‌ఎం రేవతి తండ్రి కీ.శే పర్మాల నాగరాజు జయంతి సందర్భంగా ఆయన జ్ఞాపకార్థం విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఆర్పీ నర్సింహులు, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీమా చెక్కు పంపిణీ



బీమా చెక్కు అందజేస్తున్న మేనేజర్ జనార్దన్‌రెడ్డి

కేటీదొడ్డి: మండల పరిధిలోని కుచినెర్ల గ్రామానికి చెందిన తిమ్మప్ప అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. ఈ నేపథ్యంలో ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన నుంచి మంజూరైన రూ. 2 లక్షల చెక్కును బ్రాంచ్ పోస్టు మాస్టర్ రవి కుమార్ మృతుడి కుమారుడు మల్లేష్‌కు గురువారం అందజేశారు. కార్యక్రమంలో ఐపీపీబీ మేనేజర్ జనార్దన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్ల ప్రారంభం



ఎర్రవల్లి: మండల పరిధిలోని వల్లూరు గ్రామంలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను గురువారం కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ సహకారంతో అంబేద్కర్ కూడలిలో హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేసినట్లు నాయకుడు రవిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యకర జీవితం

అమరచింత: ప్లాస్టిక్‌ను నిత్యం వాడకంతో ప్రజలు ప్రమాదకరమైన వ్యాధులకు గురవుతారని వాటిని నిషేదించాలని మున్సిపల్ మేనేజర్ యూసుఫ్ అన్నారు. వందరోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పట్టణంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ వాడటం వల్ల కలిగే నష్టాలను ప్రజలకు వివరించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ.. మురుగు కాల్వల శుభ్రత, పాతటైర్లలో నిల్వఉన్న వర్షపు నీటిని తొలగించడం, బ్లీచింగ్ చల్లడం వంటివి ప్రతిఒక్కరూ తమవంతుగా చేయాలని పేర్కొన్నారు.